# దాసరి పాట

అతడు తెలగదాసరి. అతని నివాసస్థలము తెలుగుదేశము. అతని పరివారము, చుట్టములు, అతని భార్యే. అతని ఆస్తి ఒక తాంబ్రా, ఒక గుమిసీ, ఒక జత అంజెలులు.

అతని దృష్టి యెప్పుడూ పదములలో దాగియున్న తెలుగు వీరుల మీదనే. అతని ఆశయము ఎప్పుడూ తెలుగు దేహములను పదములు పాడి పులకలెత్తించడమే.

అతడు చూడని తెలుగు గ్రామము లేదు. అతడు మెట్టని తెలుగు దేశము లేదు. అతని పాటలు వినని తెలుగువారు లేరు - కొందరు నవనాగరీకులు తప్ప.

మరాఠీ మనుష్యులవలె యెఱ్ఱని తలపాగా పెట్టుకొని చిరిగిపోయిన పాతకోటు వేసుకొని పాత జరీకండువా వల్లెవాటుగా ధరించి పంచె యెగగట్టి బుజము మీది తాంబ్రా వేళ్లతో మీటుతూ మెళ్లో పూసలు కదిలేటట్టు చిందులు తొక్కుతూ అతడు మరాఠీ కథ పదము చెప్పేటప్పుడు వీరరసము ఉట్టిపడేది. అతని బొమముడికి పెట్టుకున్న నామము పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయేది. బొటనవేలుకి తర్జనకీ తగిలించుకొన్న అంజెళ్లు/ ఖంగున మోగేవి. పక్కనే కూర్చున్న అతని భార్య గుమిసి మీద మోకాలు పెట్టి భర్త ముఖము మీదనే వీక్షణములుంచి గుమిసి వాయించునపుడు భర్త చెప్పు పదమునకు మరింత గాంభీర్యము వచ్చేది. జనులు ముగ్ధులైపోయేవారు.

అతనికి ఇరవయ్యోయేట పెళ్లైనది. పెళ్లైనది మొదలు నేటి వరకూ అతని భార్య అతని వద్దనే ఉన్నది. పెండ్లినాటి కామెకు పద్దాలు గోయేడు. ఆమె తండ్రికూడా ఒక తెలగదాసరే. కాని అతడు అకాలమృత్యువువాత పడుట చేత ఆమె తల్లివద్దనే ఉండి చాలా దరిద్రమనుభవించింది. కాని కొన్ని పదములు నేర్చుకుంది. తల్లిదగ్గిరనున్న కాలములో ఆమెకు తల్లే సర్వమున్నూ. పెళ్లిచేసుకున్న తర్వాత ఆమెకు భర్తే సర్వమూ. భర్త దగ్గిర ఆమె గుమిసి వాయించడం నేర్చుకుంది. భర్త దగ్గిర ఆమె కొత్త పదము లనేకములు నేర్చుకున్నది. భర్త పాడేటప్పుడు అతని పాటకు తాను ఊతపదమును కలిపేది. వారి హృదయాలకు అద్వితీయస్థితి లేనట్టే వారి పాటకు కూడా లేదు.

పదములోని వీరరసమును భర్త వెలువరించేటప్పుడు ఆమె హృదయము వీర రసముతో ఉప్పొంగేది.

కరుణారసము తన పదమునకు భర్త ఒప్పించేటప్పుడు ఆమె కళ్లవెంబడి వచ్చిన కన్నీళ్లు గుమిసిని తడిపేవి. 'తందానతాన' అనే ఊతపదము గద్గదమయ్యేది.

భర్త చమత్కారము చూపి చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె గుమిసి దెబ్బలలో నవ్వు వినిపించేది.

కొంటితనముతో అతడు మీసము మీద చెయ్యివేసి నాయికా నాయకుల శృంగారమును వర్ణించేటప్పుడు ఆమె తలవంచి గుమిసి తప్పు వాయించేది.

భేదములేని వారి ప్రేమకు. కౌటిల్య మెరుగనివారి ప్రేమకు, దేహములు వేరైనను వారి ఆత్మలను

ఒక్కటిగ చేసి వారి ప్రేమకు ఫలముగా వారికి ఒక కొడుకు పుట్టాడు. వానికి ఇప్పుడు ఐదోయేడు.

చదువుకున్న వాడంటే ఎవరు? వ్రాలు చేయగలవాడేనా? వ్రాలు చేయలేని భట్రాజులు, దాసరులు, జంగములు, సాతానులు, వీధిభాగవతులు - వీరిమాటేమిటి? భారత భాగవతములను, మహావీరుల దేశీయ కథలను ఇతరులకు బోధించగల వీరు చేవ్రాలు చేయలేని వారనే కారణం చేత చదువురాని వారని త్రోసివేయవచ్చునా? దేశములో కొందరు విద్యను పోషించవలెను. కొందరు వృత్తులను పోషించేవారికి చదువులలో నిగ్గు తెలియాలి. దాని కోసముసంఘములో కొందరు ఏర్పాటు కావాలి. భట్రాజులు, దాసరులు మున్నగువారు ఇట్టివారు. వీరు స్వర్వసౌఖ్యములను పరిత్యజించి భిక్షుకవృత్తి అవలంబించేరు పూర్వము. ముఖ్యముగా మత ప్రచారముకొరకై వారూరూరు తిరుగుతూ భిక్షుకులై దేశములోని అజ్ఞానమును ఒక విధముగా పోగొట్టుచున్నారు. వీరిని చూచి నేటివారు 'కూలిపని చేసుకోకూడదా?' అనడం ఆచారమైనది. వంశపారంపర్యంగా వస్తూన్న ఆచారాలని వొక్కమారు వదలిపెట్టడం కష్టం. అయినా వారికి భైక్ష్యవృత్తి నీచము కాదు. వారి దేవుడే వొక భిక్షుకుడు కాబట్టి.

ఈ కాలపు ముద్రాశాలలకన్న వీరే సంఘమునకు ఎక్కువ ఉపయోగకరంగా ఉండేవారు. అచ్చు యంత్రము చదువు వచ్చినవారికే, వీరు అందరికీ ఉపకారము చేస్తున్నారు.

మనదాసరి చాలా పాటలు పాడగలడు. బొబ్బిలి కథ, తిమ్మరాజు కథ, కోడి పుంజుల కథ, సర్వాయపాపడు కథ, కామమ్మ కథ, కాంభోజ రాజు కథ, చెంచు కథ మొదలైన కథలనేకములు రసవత్తముగా వినిపించగలడు. ఈ పదములన్నీ ఇతని భార్యకు కూడా వచ్చును. వీరి అయిదేండ్ల కొడుకుకు అప్పుడే అయిదారు కథలు ఒక మోస్తరుగా పాడటము వచ్చును.

ఇంతవరకు వీరిని భగవంతుడు ఆదరముతోనే చూచేడు. ఎక్కడికి వెళ్లినా వీరికి కడుపునిండా తిండి దొరికేది, తగిన బహుమానము దొరికేది. ఈ దాసరి దంపతులకు మొదట వొకరి మీద ఒకరికి ఎంత అనురాగముండేదో వారి పాటల మీద కూడా వారికి అంత అనురాగమే ఉండేది. ఇప్పుడు వారిద్దరూ వారి పాటల కన్న వారి కొడుకుని ఎక్కువ అనురాగముతో చూచుకొంటున్నారు. కొడుకును వొకరువిడిచి ఒకరు ఎత్తుకొనేవారే గాని నడిపించేవారు గారు. తమకు ఒక ముద్ద తక్కువ చేసుకొనేవారే గాని కొడుకు కడుపు నిండించేవారు. అసాధ్యమైన కోరికలు చెల్లించి ఆ పూటకి ఉపవాసము చేయడము కూడా అప్పుడప్పుడు కద్దు.

ఒకనాడు ఒక గ్రామములో దాసరి దంపతులు కోడిపుంజుల కథ చెప్పుచున్నారు. దాసరి కూర్చుని ఉన్నాడు. అతని ప్రక్కనే అతని భార్య వాద్యము వాయించుచున్నది. ఆమె వొడిలో వారి పుత్రుడు పడుకున్నాడు. దాసరి చూపులు అతని మీదనే తరుచుగా పడుచున్నవి. ఆమె పిల్లవాణ్ణిఉండుండి అక్కున చేర్చుకొనుచూ ఊతపదము పలకడం మరిచిపోయేది. కోడి పుంజుల యుద్ధము వర్ణించేటప్పుడు చూపే ఉత్సాహము దాసరి ఆ రోజున చూపలేకపోయాడు. రాజపుత్రుల పౌరుషవాక్యములు ఆనాడు నీరసములైనవి. ప్రజలందరు అతని పాటను విని పెదవి విరుచుకున్నారు. కొందరు ముసలివాడైనాడితడు, 'ఇక పదములు చెప్పలే'డన్నారు. గర్వము బలిసినదన్నారు మరికొందరు ఇతన్ని చూచి.

ఆ రోజున వారికి రావలసినంత ఆదాయము రాలేదు.

ఆ రోజుకు సరిపడేటంత ఆదాయమైనా రాలేదు.

రాత్రి మూడు గంటలైనది. కథ ముగిసినది. ప్రజలందరు ఇండ్లకు వెళ్లిరి. దాసరి తన కొడుకు వొంటి మీద చెయ్యివేసి చూచేడు. వొళ్లు కాలిపోతూంది. దాసరి భార్య తన కొడుకు కాలికి ఉన్న కట్టువిప్పినది. దాసరి ఏదో పసరుముద్ద కాలిమీది గాయము మీద వేసినాడు. ఆమె మళ్ళీ కట్టుకట్టి దాసరి తన తలపాగా మెత్తగా ఉండేటందుకు పక్కవేసేడు. దాని మీద తన కోటు పరిచేడు. దాసరి భార్య తనకొంగు ఆ ప్రక్కమీద వేసి దానిమీద బాలుని పడుకోబెట్టి అతని పక్కనే తాను పడుకొన్నది. ఈవలిపక్క దాసరి రాళ్లమీద పడుకున్నాడు. తూర్పున ఉదయించిన చంద్రవంక మేలుకొనియున్న దంపతుల కన్నీటి బిందువులలో ప్రకాశించింది. ఊరుబయట చెట్టు క్రింద పడుక్కొని ఉన్న దాసరి కుటుంబమునకు మరునాడు పాటపాడితేనే గాని పొట్టనిండదు.

రాత్రి యెనిమిది గంటలైంది. రెండు కిర్సనాలు దీపాలు ఊరి చివరి చెట్టుక్రింద వెలుగుచున్నవి, చుట్టూ ప్రజలు కూర్చుని ఉన్నారు. దాసరి ఒక బుజము మీద తాంబ్రా మీటుతున్నాడు. బొబ్బిలికథ చెప్తుతున్నాడు. కూర్చునే చెప్తుతున్నాడు. యథాప్రకారము అతని భార్య అతని ప్రక్కనే కూర్చున్నది. బుజము మీది వారి కొడుకు చిక్కి శల్యమైయున్నాడు. కాలిమీది కట్టు మరింత పెద్దదిగా ఉన్నది. ఉండుండి అతడు తలయెత్తి తండ్రికేసి, తల్లికేసి చూచి మళ్లీ బుజము మీద తలవాల్చి కూర్కుచున్నాడు. ఆ రోజున జ్వరము తగ్గినదని తల్లికి ఆశ కల్గినది. ఆ రోజున జ్వరము తగ్గినదని తండ్రికి బెంగగా ఉంది. బొబ్బిలి కథ క్రమక్రముగా రక్తి కట్టుచున్నదని ప్రజలనుకొనుచున్నారు. బొబ్బిలి కోట ముట్టడించడానికి సైన్యములు పూనుకొనుచున్నవి. యుద్ధమును వర్ణించి దాసరి ప్రజల మెప్పును పొందేడు. రంగారావు వీరకృత్యములు ప్రజలలో ఆవేశమును కలిగించినవి. తాంబ్రా తీగెలు కదలిపోవుచున్నవి. గుమిసి ఖంగుమనుచున్నది. దాసరి యెలుగెత్తి రంగరాయ మరణమును విలపించాడు. ప్రజలకు కళ్ల నీళ్లు గిర్రున తిరిగినవి. తల్లి బుజము మీదనున్న కొడుకు వొంటిమీద చెయ్యివేసి చూచినది ఒళ్లు చల్లబడుచున్నది. దాసరి ముఖము కేసి చూచినది. అతడు విజయరామరాజు క్రౌర్యమును వర్ణిస్తున్నాడు. కొడుకు హీన స్వరముతో 'అయ్యా' అన్నాడు. ఒకచేతిలో సానురాగముగా కొడుకును నిమిరి అ తడు కథ సాగించాడు.

తాండ్ర పాపయ్యకు బొబ్బిలి వీరుల మరణవార్త తెలిసినది. రౌద్రాకారుడై వచ్చి అతడు విజయరామరాజును చంపిన వార్త దాసరి పాడి ప్రజలకు తెలియజెప్పాడు. ప్రజలు తలవూపినారు. కాని అనుకొన్నంత రసవత్తరంగా పాపయ్య శౌర్యమును వర్ణించలేకపోయినాడేమి చెప్మా అనుకున్నారు ప్రజలు.

తల్లి తన కొడుకు వంటిమీద మళ్లీ చెయ్యివేసి చూసింది. దాసరి తాంబ్రా కిందపెట్టి రెండుచేతులతోను కొడుకు నెత్తుకొని రెండో బుజము మీద వేసుకున్నాడు. వేసుకొని బిక్కమొగముతో భార్యవంక చూచేడు.

పాపయ్య బంధువుల మరణమునకై ఎన్నడూ ఎప్పుడూ విలపించనట్లు ఆ రోజున విలపించేడు. దాసరి పాడిన పాట ఇంత కరుణామయముగా ఎప్పుడూ లేదని అనుకొన్నారు ప్రజలు. పాపయ్యతో పాటు దాసరితో పాటు ప్రజలు కూడా కన్నీళ్ళు విడిచి విలపించారు.

ఆనాడాదాసరి ఆలపించిన విలాపగీతికకు దాసరి హృదయ తంత్రులే తంబురాతీగలై శ్రుతికలిపినవి.

ఆనాడాదాసరి ఆలపించిన విలాపగీతికకు ఆ తల్లితన హృదయము మీద చేతులతో గుమిసి వాయించింది.